క్లుప్తంగా

ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న రాంబాబు

పాల్వంచ: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ... కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కూడా పేదలను విస్మరించిందన్నారు. దీంతో తెలంగాణలో ఉనికి లేకుండా పోయిందని విమర్శించారు. కేటీపీఎస్‌లో ఆర్టిజన్లను ఉద్యోగులుగా గుర్తించాలని, ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి రాయబారపు వెంకటేశ్వర్లు, పగిడిపల్లి సంజీవరావు, కుంజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో సరిపడా విత్తనాలు



మాట్లాడుతున్న ఏఓ సతీష్

ఇల్లెందురూరల్: ప్రస్తుత వానాకాలానికి అవసరమైన విత్తనాలు సరిపడా అందుబాటులో ఉన్నాయని ఏఓ సతీష్ తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సీజన్ ప్రారంభమైనందున అన్ని విత్తన విక్రయ దుకాణాలలో సరిపడా స్టాక్ నిల్వ ఉందని చెప్పారు. విక్రయించే ప్రతీ విత్తనం నాణ్యమైనదేనని చెప్పారు. ఎక్కడా నకిలీ విత్తన విక్రయాలకు అవకాశం లేకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా అలాంటి విక్రయాలు జరిగితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. నేలలో సరిపడా తేమశాతం వచ్చాకే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు.

భద్రయ్య మృతి విప్లవోద్యమాలకు లోటు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి, చంద్ర అరుణ తదితరులు

ఇల్లెందురూరల్: సుదీర్ఘకాలం అజ్ఞాత దళంలో పనిచేసి, ఇల్లెందు ఏజెన్సీలో విప్లవోద్యమాల నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన ఈసం భద్రయ్య (72) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన భౌతికకాయంపై మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాస్‌లైన్ నాయకులు చంద్ర అరుణ, నాయిని రాజు, సీఐటీయూ జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవిత చరమాంకం వరకు పేదల ప్రజల పక్షాన పోరాడిన నేతగా భద్రయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బుర్ర వెంకన్న, శంకర్, అజయ్, సత్యం, తనిష్కా, రాంబాబు, కోటేశ్వరరావు, బుచ్చిరాములు, గాంధీ, సీఐటీయూ నాయకులు సుల్తానా, చీమల రమణ, మన్యం మోహన్ రావు పాల్గొన్నారు.

9న జూనియర్ సివిల్ జడ్జి మోడల్ టెస్ట్



మోడల్ టెస్ట్ రాస్తున్న దృశ్యం (ఫైల్)

కొత్తగూడెంటౌన్: 9వ తేదీన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎం.వి.ప్రసాదరావు, రమేష్‌కుమార్ మక్కడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న తెలంగాణ హైకోర్టు వారు నిర్వహించనున్న జూనియర్ సివిల్ జడ్జి స్క్రీనింగ్ టెస్ట్‌ను యువ న్యాయవాదులు విజయవంతంగా ఎదుర్కోవడంలో సహాయ పడేందుకు నమూనా టెస్ట్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈనెల 9న కొత్తగూడెం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో టెస్ట్ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పరీక్షల్లో పాల్గొనదలచినవారు కిలారు పురుషోత్తంరావు, పి.కిషన్ రావు, ఎస్.వెంకటనర్సయ్య, జె.శివరాంప్రసాద్‌లను సంప్రదించాలని కోరారు.

ఇక నిరంతరంగా సదరం స్లాట్లు

- ఎప్పుడైనా స్లాట్ బుకింగ్‌కు అవకాశం
- కొత్త విధానంతో దివ్యాంగులకు ఊరట



సదరం సర్టిఫికెట్లు అందుకుంటున్న దివ్యాంగులు (ఫైల్)

చుంచుపల్లి: దివ్యాంగులకు సదరం స్లాట్ బుకింగ్‌ల విషయంలో ఊరట లభించింది. ఎన్నో వ్యయ ప్రయాసలతో స్లాట్ బుకింగ్ కోసం ఎదురుచూసే బాధితులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇకనుంచి వారు ఎప్పుడంటే అప్పుడు నేరుగా మీసేవా కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకునే విధంగా అవకాశం కల్పించింది. గతంలో ఉన్న విధానాన్ని ఎత్తివేయడంతో దివ్యాంగులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ఇకనుంచి వారి వీలును బట్టి సదరం స్లాట్లను బుక్ చేసుకోవచ్చు. సదరం శిబిరాల కోసం అర్హులైన దివ్యాంగులు ఇక నెలల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా గతంలో దొర్లిన తప్పులు, లోటుపాట్లను గుర్తించిన ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో దివ్యాంగులు ఎప్పుడైనా స్లాటు బుక్ చేసుకోవచ్చు. ఇది వరకు నెలలో రెండు, నాలుగో వారాల్లో మాత్రమే సదరం శిబిరాలను నిర్వహించేవారు. దీంతో స్లాటు నమోదుకు మీసేవా కేంద్రాల వద్ద వేచి చూడాల్సి వచ్చేది. ఒక్కో సదరం శిబిరంలో 100 నుంచి 120 మంది దివ్యాంగులకు మాత్రమే అవకాశం లభిస్తుండటంతో చాలామందికి స్లాటు దొరక్క నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఇక నుంచి ఆ సమస్యకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది. అర్హులైన దివ్యాంగులు తగిన ధ్రువపత్రాలతో ఎప్పుడైనా మీసేవా కేంద్రాలల్లో సదరం స్లాటు బుక్ చేసుకునే సదుపాయం కల్పించింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.

మొబైల్‌కే నేరుగా సమాచారం..

దివ్యాంగులు స్లాట్ బుకింగ్ చేసుకోగానే సదరం శిబిరం నిర్వహించే తేదీ, స్థలం వివరాలను చూపిస్తుంది. స్లాటు లేని పక్షంలో రిజర్వులో ఉంటుంది. ఎప్పుడైతే షెడ్యూల్ ఇస్తారో వారికి ఆటోమెటిక్‌గా స్లాట్ అలాట్‌మెంట్ అవుతుంది. ఒక్కసారి బుక్ అయితే మొబైల్‌కే మెస్సేజ్ వస్తుంది. అందులో క్యాంపు, స్లాటు వివరాలు ఉంటాయి. ఎడిట్ ఆప్షన్ కూడా క్యాంపు లాగిన్ నుంచి తొలగించారు. దీంతో స్లాట్ నమోదు చేసేటప్పుడు ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలి. సదరం శిబిరం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ వ్యక్తికి వరుస సంఖ్యను కేటాయించి రిజర్వ్(వెయిటింగ్)లో ఉంచుతారు. ఆ ప్రకారం టోకెన్లు జారీ చేస్తారు. సెల్‌కు వచ్చిన మెస్సేజ్ ఆధారంగా ఆ తేదీన శిబిరం నిర్వహించే స్థలానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలోనే సదరం క్యాంపులను నిర్వహిస్తున్నారు. అక్కడ వైద్యులు తగిన పరీక్షలను నిర్వహించి అంగవైకల్యాన్ని నిర్ధారిస్తారు.

నిర్దేశించిన స్థాయిలో దివ్యాంగులు అర్హత సాధిస్తే వారికి సదరం సర్టిఫికెట్‌ను డీఆర్‌డీఏ ద్వారా అందజేస్తారు. అర్హులైన దివ్యాంగులు ఆధార్, రేషన్ కార్డు, గుర్తింపు కార్డులతో సదరం స్లాట్ బుకింగ్‌ను మీ సేవా కేంద్రాలలో ఇక నుంచి ఎప్పుడైనా నమోదు చేయించుకోవచ్చని, రశీదు నంబరు ఆధారంగా వారి స్లాట్ రిజర్వ్‌లో ఉంటుందని, ఎటువంటి తప్పులు దొర్లకుండా నమోదు చేసుకోవాలని డీఆర్‌డీఏ అధికారులు సూచిస్తున్నారు. నమోదు సమయంలో ఇచ్చిన ఫోన్ నంబరు నిరంతరం పనిచేస్తూ ఉండాలని, సదరం ధ్రువపత్రం పోస్టు ద్వారా కానీ లేదా నేరుగానైనా పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.



పరీక్షిస్తున్న వైద్యుడు (ఫైల్)

మంచి పరిణామం..



దివ్యాంగులకు సదరం స్లాట్ బుకింగ్‌లో కొత్త విధానాన్ని తీసుకురావడం మంచి పరిణామం. ఇప్పటి వరకు అధికారులు సదరం శిబిరాల తేదీలు ఖరారు చేసిన తర్వాతనే మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్ బుకింగ్ అవకాశం ఉండేది. అప్పుడు మాత్రమే వెబ్‌సైట్ అందుబాటులో ఉండేది. ఆ విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికి ఇక ఎప్పుడైనా స్లాట్ బుకింగ్ చేసుకొని తరువాత అధికారులు ఇచ్చిన తేదీల మేరకు సదరం శిబిరాలకు హాజరయ్యే అవకాశం కల్పించడం దివ్యాంగులకు ఎంతో ప్రయోజనం.

– గండవనేని సతీష్ కుమార్, చుంచుపల్లి

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజేశ్‌నాయక్

పాల్వంచ: ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కమిటీ తీర్మానం చేసి వందశాతం రిజర్వేషన్ అమలు చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేశ్ నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయం ప్రాంగణంలో ఈనెల 26న తలపెట్టిన చలో హైదరాబాద్ ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఏజెన్సీ డీఎస్సీ, జనరల్ డీఎస్సీ రెండు రకాల నోటిఫికేషన్లను ప్రకటించాలన్నారు. 1/59, 1/70 చట్టాలను అమలు చేయాలని, 1996 పెసా చట్టం ప్రకారం స్థానిక గిరిజన అభ్యర్థులతోనే వందశాతం ఉద్యోగులను భర్తీ చేయాలన్నారు. ఐటీడీఏ, బ్యాక్ లాగ్ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో నూనావత్ రవినాయక్, గుగులోతు లాల్‌సింగ్, కల్తీ పాపయ్య, భట్టురన్న, భూక్యా కల్యాణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పలువురు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కొత్తగూడెంలోని తన నివాసంలో వీరికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో నిమ్మటూరి కనకయ్య, మాలోత్ నర్సింహారావు, ధర్మరాజుల పుల్లయ్య తదితరులు ఉండగా కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకట్‌రెడ్డి, పొన్నెకంటి సతీష్‌కుమార్, చెరుకుమల్లి నవీన్, ధరావత్ కాన్సీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజా సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న మిర్యాల రంగయ్య

ఇల్లెందు: దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఈసారి జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా అధికారం చేపట్టే పరిస్థితి లేకుండా ప్రజలు తీర్పు ఇచ్చారని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు మిర్యాల రంగయ్య అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ, ప్రజా సంఘాల సంయుక్త కౌన్సిల్ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాదేండ్ల శ్రీనివాసరెడ్డి సీపీఐ, ఏఐటీయూసీలో చేరారు. ఆయనకు మిర్యాల రంగయ్య సీపీఐ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రంగయ్య మాట్లాడుతూ.. 400 సీట్లు సొంతంగా వస్తాయని మోదీ ప్రగల్భాలు పలికాడని విమర్శించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మారుస్తామని రిజర్వేషన్లు ఎత్తివేస్తామని గొంతు చించుకుని ప్రచారం చేసిన బీజేపీ అహంకారానికి ప్రజలు ఓటుతో సమాధానం చెప్పారన్నారు. టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా పేరు మార్చుకుని దేశవ్యాప్తంగా తన రాజకీయాలు ప్రభావితం చేస్తాయని బీరాలు పలికినంత మాత్రాన సాధ్యం కాలేదని ఎన్నికల్లో చతికిల పడిందని ఎద్దేవా చేశారు. కె. సారయ్య, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, నజీర్ అహ్మద్, దాసరి రాజారాం పాల్గొన్నారు.

జూలై 7న మాదిగల ఆత్మగౌరవ కవాతు

టేకులపల్లి: జూలై 7న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దేపంగి రమణయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని గ్రావిటీ స్కూల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మరియు అనుబంధ సంఘాల జిల్లా సమావేశం మెంతిన ప్రభాకర్ మాదిగ అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ... ఈ కవాతును మాదిగల ఆత్మగౌరవానికి ప్రతీకగా చూడాలని, లక్షలాది మంది మాదిగలు ఈ కవాతుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లగట్ల వెంకన్న, జినక ఇస్తారి, బోయ జగన్నాథం, కొత్తపల్లి సోమయ్య, మెంతిన వసంతరావు, ఇసంపల్లి కృష్ణ, అలవాల రాజా, చెంగల గురునాథం పాల్గొన్నారు.

గ్రీన్‌మ్యాట్లతో మొక్కల సంరక్షణ



తొగ్గూడెం నర్సరీలో ఏర్పాటు చేసిన గ్రీన్‌మ్యాట్లు

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఎండ తీవ్రత కారణంగా మొక్కలు చనిపోకుండా వేసిన గ్రీన్‌మ్యాట్లు సంరక్షణగా మారాయి. పదో హరితహారం కోసం గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో పంచాయతీ సిబ్బంది సహకారంతో మొక్కలను పెంచుతున్నారు. పండ్లు, నీడనిచ్చే, పూల మొక్కలతోపాటు వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. వేసవిలో ఎండలకు దెబ్బతినకుండా నర్సరీలోని మొక్కలపై గ్రీన్‌మ్యాట్లను ఏర్పాటు చేసి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పాల్వంచ మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండలకు చనిపోకుండా నిత్యం నీళ్లు పడుతూ గ్రీన్ మ్యాట్లు వేసి సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

ఒక్కో నర్సరీలో పదివేల మొక్కల పెంపకం...

పల్లెలు పచ్చదనంతో ఉండాలనే సంకల్పంతో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని 36 గ్రామపంచాయతీలో 36 నర్సరీలను ఏర్పాటు చేశారు. పదో విడత హరితహారంలో మొక్కలను నాటడం కోసం ఒక్కో నర్సరీలో పదివేల చొప్పున మండలం మొత్తంలో 3.60 లక్షల మొక్కలను నాటే లక్ష్యంగా సంబంధిత అధికారులు నిర్దేశించారు. ఈ నర్సరీలో మొక్కల సంరక్షణ కోసం నియమించిన కూలీలు నర్సరీలో విత్తనాలు నాటిన దగ్గర నుంచి మొక్కగా ఎదిగే వరకు, మొక్కల మధ్యలో కలుపును తొలగిస్తూ, వాటికి నీటిని పెట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా కూలీ వేతనాన్ని అందిస్తున్నారు.

మొక్కలను రక్షిస్తున్నాం..



హరితహార కార్యక్రమంలో భాగంగా మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో 3.60 లక్షల మొక్కలు నర్సరీల్లో పెరుగుతున్నాయి. మొక్కలు ఎండలకు వాడిపోకుండా, చనిపోకుండా సంరక్షణ కోసం గ్రీమ్‌మ్యాట్లను ఏర్పాటు చేశాం. ప్రభుత్వం ఈజీఎస్ స్కీమ్ కింద నర్సరీకి రూ.7వేల నుంచి 8వేల వరకు మట్టి, ఇసుక, విత్తనాల కోసం నిధులు కేటాయిస్తుంది. హరితహారంలో మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేస్తాం.

– కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ

క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి



ట్రోఫీ అందజేస్తున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: క్రీడలతో శారీరక ధ్రుడత్వమే కాకుండా స్నేహసంబంధాలు మెరుగు పడతాయని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఇల్లెందు 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో జరిగిన సింగరేణి, ఇల్లెందు ప్రెస్ క్లబ్‌ల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను జీఎం ప్రారంభించారు. మాట్లాడుతూ... గెలిచినా, ఓడినా గర్వపడడం, కుంగిపోవడం ఉండరాదని, క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకుని ముందుకు సాగితే గెలుపుకు దోహద పడుతాయని తెలిపారు. అనంతరం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ప్రెస్ క్లబ్ జట్టుపై సింగరేణి జట్టు విజయం సాధించింది. జీఎం జాన్‌ఆనంద్ ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, కేటీసీ పీఓ శ్రీనివాస్, అధికారుల సంఘం నేత నాగేశ్వరరావు, గుర్తింపు సంఘం నేత కె.సారయ్య, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు జే.వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, పర్యావరణ అధికారి ధనుంజరెడ్డి, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ప్రెస్‌క్లబ్ కెప్టెన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటోలను అడ్డుకున్న స్థానికులు



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ స్వామి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

పాల్వంచ: పాత పాల్వంచ ఊరి మధ్యలో నుంచి చెత్తను తరలిస్తున్న స్వచ్ఛ ఆటోలను శుక్రవారం స్థానికులు అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఏ.స్వామి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అక్కడికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ... ఊరి మధ్యలో నుంచి తరలించడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. రాకపోకల వల్ల దుర్వాసన వెదజల్లుతోందని, మున్సిపాలిటీ శివారు ప్రాంతాల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి చెత్తను స్వచ్ఛ ఆటోల ద్వారా తరలించాలన్నారు. దీంతో కమిషనర్ స్వామి మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం రెండు నెలల వ్యవధి ఇవ్వాలని కోరారు. దీంతో స్థానికులు స్వచ్ఛ ఆటోలను పంపించివేశారు. కార్యక్రమంలో డీఈ మురళీ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు, స్థానికులు యాకూబ్, రెహ్మాన్, కరీం, దారా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం త్వరగా అందించాలి



యూనిఫాంను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి సులోచనారాణి

చుంచుపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయనున్న యూనిఫాం కుట్టు పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సులోచనారాణి అన్నారు. శుక్రవారం మండలంలో డ్రైడే – ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా చుంచుపల్లి మండలంలో ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడిన, ప్రభుత్వ పాఠశాలలకు అందజేసే యూనిఫాం కుట్టు పనులను బాబూ క్యాంప్ స్కూల్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈనెల 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో త్వరితగతిన యూనిఫాం కుట్టడం పూర్తిచేయాలని, కుట్టిన దుస్తులను సంబంధిత పాఠశాలలకు సకాలంలో చేరవేయాలన్నారు. గ్రామపంచాయతీల పరిధిలోని అన్ని పాఠశాలల్లో పారిశుద్ధ్యం, పిచ్చిమొక్కల తొలగింపు, మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రపరచాలని సూచించారు. మండల పంచాయతీ అధికారి గుంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏఐటీఎఫ్ సదస్సును జయప్రదం చేయండి

ఇల్లెందురూరల్: 9వ తేదీన కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం (ఏఐటీఎఫ్) రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఫోరం నాయకురాలు కల్తి సుభద్ర కోరారు. ఈ మేరకు చల్లసముద్రం, వేములవాడ గ్రామాలలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఆదివాసీలను అడవుల నుంచి తరిమికొట్టి అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆదివాసీలకు కల్పించిన హక్కులను పకడ్బందీగా అమలు చేసే విధంగా పాలకులపై ఒత్తిడి తేవడమే లక్ష్యంగా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. సదస్సులో ఆదివాసీల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి..



ఇల్లెందు: బడిబాటలో విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఇల్లెందు: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని గరల్స్ హైస్కూల్, జేబీఎస్ స్కూల్, మెయిన్‌రోడ్ హైస్కూల్, సుభాష్‌నగర్, 21ఫిట్ హైస్కూల్‌ల హెచ్‌ఎంలు రాంబాబు, శర్మ, స్వామి, ఉమామహేశ్వరరావు, యాదమ్మల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి విద్యార్థులకు కరపత్రాలు అందజేసి ఆయా పాఠశాలల తీరు తెన్నులను వివరించారు. తల్లిదండ్రులను కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వ హైస్కూల్‌లలో అన్ని సదుపాయాలు ఉన్నాయని, మెరుగైన బోధన ఉంటుందని తెలిపారు.

కొత్తగూడెంఅర్బన్: బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పంజాబ్‌గడ్డ, నాగయ్య, త్రీఇంక్లైన్ ప్రాంతాలలో వినూత్నంగా డప్పు వాయిద్యాలు, బ్యానర్లు, కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పిల్లలందరినీ చదివించాలని, చదువే తలరాతని మారుస్తుందని, పాఠశాల అభివృద్ధి, ప్రగతి గురించి వివరిస్తూ పిల్లల్ని విధిగా పాఠశాలలో చేర్పించాలన్నారు. హెచ్‌ఎం డాక్టర్ ప్రభుదయాళ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట (మన ఊరు – మన బడి) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎం, సెర్ప్ ఏపీఎం, సీసీ, వీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19వ తేదీ వరకు కొనసాగే బడిబాట కార్యక్రమంలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించుకోవడం ద్వారా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచేలా కృషి చేయాలన్నారు. ఈనెల 10న విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం పంపిణీ జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఓ సంజీవరావు, సెర్ప్ ఏపీఎం సత్యనారాయణరాజు, సీసీలు డి.నాగేశ్వరరావు, బి.మధుసూదన్‌రావు, రామారావు, హెచ్‌ఎంలు, వీఓలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి విద్యార్థి ప్రభుత్వ స్కూల్‌కు వెళ్లి చదువుకునే విధంగా చూడాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన బడిబాట కార్యక్రమంపై హెచ్‌ఎంలు, ఐకేపీ, ఐసీడీఎస్ అధికారులతో అవగాహన సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఎంపీడీఓ డ్వాక్రా మహిళలు కుట్టిన విద్యార్థుల యూనిఫాంను ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను తల్లిదండ్రులకు తెలియజేసి విద్యార్థులను స్కూల్‌లో చేర్పించాలన్నారు. గ్రామంలో ఎడ్యుకేషన్ జాబితాను తయారు చేసి ప్రతీ పిల్లవాడు ఎక్కడ చదువుకుంటున్నారో ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. మండల విద్యాశాఖాధికారి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమంలో భాగంగా 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతీ ఉపాధ్యాయుడు షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో అవగాహన కల్పించి వందశాతం పిల్లలు సర్కార్ బడుల్లో చేరేవిధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వివేక్, సీడీపీఓ రేవతి, ఎంపీఓ బొగ్గ నారాయణ, నోడల్ అధికారి ప్రకాశ్‌రావు, ఏపీఎం రాంబాబు, ఏపీఓ రంగా, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: బడిఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాలలో ఉపాధ్యాయులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాలలో పాఠశాల విద్యార్థులను కలుపుకొని ప్రదర్శనలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులు, విద్యార్థులను స్వయంగా కలిసి పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలు, ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలలను మించి అధునాతన సౌకర్యాలు, అనుభవం, అంకితభావం కలిగి ఉన్న ఉపాధ్యాయులు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదితరాలతోపాటు గ్రంథాలయం, సైన్స్‌ల్యాబ్ వంటి అనేకం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జూలూరుపాడు: సమావేశానికి హాజరైన హెచ్‌ఎంలు, సెర్ప్ సిబ్బంది, వీఓలు



ఇల్లెందురూరల్: చల్లసముద్రంలో కరపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయుడు



పాల్వంచరూరల్: యూనిఫాం అందజేస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి